సాక్షి
యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



ఏకకాలంలో మాఫీ చేయాలి
వంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారు. - 9లో



పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ లేనట్టే..
పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేయలేమని కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి పార్లమెంట్‌లో స్పష్టం చేశారు. -10లో

గరిష్టం/కనిష్టం 33°/15°

వాతావరణం
ఆకాశం ఉదయం పొగమంచుతో మేఘావృతంగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

59,97,254 మందికి కంటి పరీక్షలు

భువనగిరి : జిల్లాలో కంటి వెలుగు పరీక్షలు కొనసాగుతున్నాయి. జనవరి 18వ తేదీన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందుకోసం 34 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 59,97,254 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 12,740 మందికి రీడింగ్ అద్దాలు అందజేశారు. 8,941 మందికి ప్రిస్కిప్షన్ అద్దాలు ఇవ్వాల్సి ఉందని డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు తెలిపారు.

ఈవీఎంల పరిశీలన

భువనగిరిటౌన్ : భువనగిరి శివారులోని గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలను గురువారం కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. పని చేయని ఒక బ్యాలెట్ యూనిట్‌ను ఈసీఐఎల్ (ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ హైదరాబాద్)కు పంపించినట్లు తెలిపారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఎస్పీ నాయకులు బట్టు రామచంద్రయ్య, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ గిరిధర్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కుమార్ ఉన్నారు.

నిధులు మంజూరు చేయాలని కేటీఆర్‌కు వినతి



మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట, ఆలేరు మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు ఇవ్వాలని ఐటీ, పురపాలక శాఖమంత్రి కేటీఆర్‌ను ప్రభుత్వ విప్ గొంగిడి సునీత కోరారు. మంత్రిని అసెంబ్లీలోని ఆయన కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలను అభివృద్ధి చేయాలని, నిధులు కేటాయించి సహకరించాలని కోరారు.

బస్సులు అద్దెకు తీసుకుంటే 10 శాతం రాయితీ

యాదగిరిగుట్ట : పెళ్లిళ్ల సీజన్‌లో ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకుంటే 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు యాదగిరిగుట్ట డిపో మేనేజర్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల బస్ సర్వీస్‌లకు 10 శాతం రాయితీ వర్తిస్తుందని, ముందస్తుగా ఎలాంటి డిపాజిట్ లేకుండానే ఈ సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశం జూన్ 30వ తేదీ వరకు అమల్లో ఉంటుందన్నారు. బస్సులు అద్దెకు కావాల్సిన వారు www.tsrtconline.in ను సంప్రదించాలన్నారు.

బస్సుల పునరుద్ధరణకు రోడ్డు పరిశీలన



రోడ్డును పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారులు

సంస్థాన్ నారాయణపురం : సంస్థాన్ నారాయణపురం – డాకుతండా వయా బండలేమురు (రంగారెడ్డి జిల్లా) మీదుగా ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇబ్రహీంపట్నం డిపోఅధికారులు గురువారం రోడ్డును పరిశీలించారు. ప్రయాణానికి రహదారి అనువుగా ఉందా లేదా చూశారు. బస్సుల పునరుద్ధరణకు కృషి చేసిన సీపీఎం నాయకులను ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ, వట్టి వెంకటేశం, జోగు శ్రీనివాస్, జగదీశ్వర్, జంగయ్య, దర్శన్, కిషన్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో విద్యారంగం నిర్వీర్యం

భువనగిరి : విద్యా రంగాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చత్రపతి, ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ విమర్శించారు. గురువారం భువనగిరిలోని ప్రిన్స్ చౌరస్తాలో జరిగిన ఏబీవీపీ జిల్లా సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతుందన్నారు. అవినీతి రహితపాలన అంతానికి మరో విద్యార్థి ఉద్యమం తప్పదన్నారు. అంతకు ముందు ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్, నగర కార్యదర్శి శివ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ విభాగ్ సంఘటన కార్యదర్శి కార్యదర్శి లక్ష్మణ్, విభాగ్ కన్వీనర్ సుర్వి మణికంఠ, బాబు, సాయి, ముఖేష్, భరత్, సంజయ్, దీపిక, శ్రీ విద్య, నిఖిల్, ప్రసాద్, భరత్, సంజయ్, పల్లవి,ప్రసన్న పాల్గొన్నారు.



లింగమంతుల స్వామిని దర్శించుకునేందుకు క్యూలో నిల్చున్న భక్తులు



పెద్దగట్టు ఆలయం నుంచి సూర్యాపేట పట్టణంలోని గొల్లబజార్‌కు మకరతోరణాన్ని తరలిస్తున్న వల్లపు, కోడి వంశస్తులు, యాదవులు తదితరులు

పెద్దగట్టు జాతర పరిసమాప్తం

ఐదు రోజుల పాటు ఓ లింగా.. నామస్మరణతో మార్మోగిన దురాజ్‌పల్లిలోని శ్రీలింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర గురువారం ముగిసింది. చివరి రోజు భారీగా భక్తులు తరలివచ్చి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మకర తోరణాన్ని సూర్యాపేట పట్టణానికి తరలించడంతో జాతర పరిసమాప్తమైంది. – సూర్యాపేట, చివ్వెంల -8లో

పాలు కాదు.. విషం!

రసాయనాలతో కల్తీ పాలు తయారీ

- శవాలను భద్రపరిచేందుకు వాడే ఫార్మాల్డిహైడ్ వినియోగం
- అధికారుల తనిఖీల్లో వెలుగులోకి
- రెండు నెలల్లో ఆరు ఘటనలు
- ఈజీ మనీ కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం



బీబీనగర్ మండలం కొండమడుగులో కల్తీ పాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి : సంపాదనే ధ్యేయంగా కొందరు అక్రమార్కులు ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. ప్రమాదకర రసాయనాలతో కృత్రిమ,కల్తీ పాలు తయారు చేస్తూ వినియోగదారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. గతంలో పాల పొడర్, యూరియా, నూనె కలిపి పాలు తయారు చేయడం చూశాం. కానీ, బీబీనగర్ మండలం కొండమడుగలో ఓ వ్యాపారి మనుషుల శవాలను భద్రపరిచేందుకు వాడే ప్రాణాంతక ఫార్మాల్డిహైడ్‌ను కలుపుతున్నట్లు ఫుడ్ సెక్యూరిటీ అధికారులు గుర్తించారు. గడిచిన రెండు నెలల్లో ఆరు చోట్ల కల్తీ పాలు పట్టుబడ్డాయి. తాజాగా గురువారం భూదాన్ పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామంలో కల్తీ పాల తయారీ గుట్టు రట్టయ్యింది.

రాజధానికి సమీప మండల్లాలో ఎక్కువ

పాల దిగబడి తగ్గి, మరోవైపు డిమాండ్ పెరగడంతో అక్రమార్కులు కల్తీ పాల తయారీకి మొగ్గు చూపుతున్నారు. లాభాల అత్యాశతో స్వచ్ఛమైన పాలను కల్తీ చేస్తున్నారు. ముఖ్యంగా కల్తీ పాల దందా హైదరాబాద్‌కు చేరువలో ఉన్న హెచ్‌ఎండీఏ మండలాలైన భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, భువనగిరి, చౌటుప్పల్, బొమ్మలరామారంలో జోరుగా సాగుతోంది. వ్యాపారులు తెల్లవారుజామునే నగరానికి పాలు రవాణా చేస్తుండటంతో అధికారుల నిఘా కొరవడింది. ఇది కాస్తా అక్రమార్కులకు కలిసొస్తుంది.

లీటరు పాలు మూడింతలు

వ్యాపారులు గ్రామాల్లో రైతుల నుంచి గెదెల పాలను సేకరిస్తారు. లీటరు రూ.40ల నుంచి రూ.45కు కొనుగోలు చేస్తున్నారు. వీటిలో నీళ్ల, పాల పొడర్, ఇతర రసాయనాలను కలిపి మూడింతలు చేస్తున్నారు. ఈ పాలను ఆటోలు, ట్రాలీలు, ద్విచక్ర వాహనాలపై హైదరాబాద్‌లోని హోటళ్ల, స్వీటు షాపులు, గృహాలకు సరఫరా చేస్తున్నారు. లీటరు రూ.60 నుంచి రూ.80లకు విక్రయిస్తున్నారు. అయితే కల్తీని గుర్తించని ప్రజలు.. గ్రామాల నుంచి వచ్చే పాలు స్వచ్ఛమైనవని భావించి కొనుగోలు చేస్తున్నారు.

దుష్పరిమాణాలు

హైడ్రోజన్ పెరాక్సైడ్, ఫార్మాల్డిహైడ్, సుక్రోజ్, నూనె, యూరియా, సర్ఫ్, బేకింగ్ సోడా, యూరియా, పాలపొడి లాంటి రసాయన పదార్థాలను వినియోగించి కల్తీ పాలు తయారు చేస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో వెలుగుచూసింది. అయితే కల్తీ పాలను దీర్ఘకాలంగా తాగడం వల్ల ప్రాణాంతక క్యాన్సర్, కాలేయం, మెదడు సంబంధిత వ్యాధులతో పాటు ఇతర దుష్పరిణామాలు తలెత్తే ప్రమాదం ఉందని డాక్టర్లు పేర్కొంటున్నారు.

నమోదైన కేసులు ఇలా..

- ఈ నెల 9వ తేదీన భూదాన్‌పోచంపల్లి మండలం ఇంద్రియాలలో 200 లీటర్ల కల్తీ పాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- జనవరి 31న భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్, బీబీనగర్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో 400 లీటర్ల కల్తీ పాలు పట్టుబడ్డాయి.
- జనవరిలో బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామానికి చెందిన ఓ వ్యాపారి తన పాల సెంటర్‌లో పాలు విరిగిపోకుండా, ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు ఫార్మాల్డిహైడ్ రసాయనాన్ని వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు.
- జనవరిలో భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపూర్‌లో కల్తీ పాలు పట్టుబడ్డాయి.
- జనవరిలో చౌటుప్పల్ మండలం అల్లాపురంలో 160 లీటర్ల కల్తీ పాలను పోలీసులు పట్టుకున్నారు.
- మూడు నెలల క్రితం బొమ్మలరామారం మండలం చౌదరిపలి గ్రామంలో పోలీసులు కల్తీపాల గుట్టు రట్టు చేశారు.

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం



కల్తీ పాలను తాగడం వల్ల ముఖ్యంగా జీర్ణక్రియ, కండరాలు, నాడీ వ్యవస్థ, మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కల్తీ పాలలో వినియోగించే రసాయనాలు స్లో పాయిజన్‌గా మారి శారీరక, మానసిక సమస్యలు ఏర్పడుతాయి. జ్ఞాపక శక్తి మందగిస్తుంది.రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లలు, వృద్ధుల్లో ఈ ప్రభావం అధికంగా ఉంటుంది.
–యాదగిరి, వైద్యాధికారి, భూదాన్‌పోచంపల్లి

తనిఖీలు ముమ్మరం

కల్తీ పాలను తయారు చేసి విక్రయించడం నేరం. గ్రామాల్లో కల్తీ పాలను తయారు చేసే వారిని గుర్తించేందుకు ముమ్మరంగా తనిఖీలు చేసి అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తున్నాం. అవసరమైతే వారిపై పీడీ యాక్ట్ పెట్టుతాం. పాలు, ఇతర ఆహారపదార్థాలు కల్తీ చేస్తున్నట్లు తెలిస్తే ప్రజలు అధికారులకు సమాచారం ఇవ్వాలి.
– జ్యోతిర్మయి, జిల్లా జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

పాలల్లో రసాయనాలు

- కల్తీ పాల తయారీదారుడిపై కేసు

కల్తీ పాలు తయారు చేసి విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. భూదాన్ పోచంపల్లి మండలంలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన పాల వ్యాపారి పట్నం ప్రభాకర్ కల్తీ పాలను తయారు చేసి సొంత వాహనంలో హైదరాబాద్‌లోని హోటళ్లు, వినియోగదారులకు విక్రయిస్తున్నాడు. కల్తీ పాలు తయారు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం ఉదయం పోలీసులు ప్రభాకర్ ఇంటిపై దాడులు నిర్వహించారు. ఇంటి నుంచి 200 లీటర్ల కల్తీపాలతో పాటు, పాల తయారీకి వినియోగించే ఒక లీటర్ హైడ్రోజన్ పెరాక్సైడ్ బాటిల్, ఒక పాల ప్యాకెట్, ఐదు అల్యూమినియం పాల క్యాన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు ప్రభాకర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపారు.



కల్తీ పాలు నింపిన క్యాన్లు, నిందితుడు ప్రభాకర్

పన్నుల వసూళ్లపై అలసత్వం వద్దు

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్లతో సమావేశం అభివృద్ధి పనులు, పన్నుల వసూళ్లపై సమీక్షించారు. పన్నుల వసూళ్లలో వేగం పెంచాలన్నారు. మొండి బకాయిదారులు ఉంటే ఆస్తులు సీజ్, జప్తు చేసి రాబట్టాలని సూచించారు. కనీసం 90 శాతం పన్నులు వసూలు కావాలని, లక్ష్యాన్ని చేరుకునే వరకు సిబ్బందికి సెలవులు ఇవ్వరాదని, సెలవు రోజుల్లో కూడా పని చేయాలని సూచించారు. పన్నుల వసూళ్లలో అసలత్వం ప్రదర్శించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సిద్ధంగా కావాలని, అవసరమైన వాటిని డాక్యుమెంటేషన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ర్యాంక్ సాధించడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. అంతేకాకుండా మున్సిపాలిటీల్లో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమీకృత మార్కెట్‌లు, వైకుంఠ ధామాలు, బస్తీ దవాఖానాల తదితర పనులను మార్చి లోగా, చౌటుప్పల్‌లో మిషన్ భగీరథ పైలాన్ పార్కు పనులు వారంలో పూర్తికావాలన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షి,యాదాద్రి : సుస్థిర గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్లాన్, పనుల గుర్తింపు, కార్యాచరణపై మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి అధికారులకు గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పంచాయతీల అభివృద్ధి కోసం పనులు గుర్తించాలని, అందుకు అవసరమైన వనరుల ఏర్పాటుకు కార్యాచరణ, ప్రణాళికలు రూపొందించాలని కోరారు. పంచాయతీల అభివృద్ధికి రూపొందించిన 9 అంశాల్లో ఆ గ్రామానికి కావాల్సిన పనులను నిర్దేశించుకోవాలన్నారు. స్వంతంగా సాధించే వనరులతో నిధుల కేటాయింపు చేసుకోవాలని, మహిళలు, బాలల సభలు ఏర్పాటు చేసి వారి భవిష్యత్‌కు ఉపయోగపడే పనులను గుర్తించాలన్నారు. పనులు, తీర్మానాల వివరాలను వెంటనే సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని, అనంతరం సర్పంచ్‌లకు మండల స్థాయిలో ఆయా కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయికి, జిల్లా స్థాయికి తీర్మానాలు పంపాలని తెలిపారు. బుధవారం బోధన, స్నేహిత కార్యక్రమాలు, డీపీడీపీ ప్రణాళికల తయారీలో ప్రజాప్రతినిధులను మమేకం చేయాలని కోరారు.అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ క్లస్టర్ల వారీగా మండల అధికారులకు అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో జాతీయ స్థాయిలో అవార్డులు సాధించాలంటే లక్ష్యాలను సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సునంద, అధికారులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు సహకరించండి



మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో అదనపు కలెక్టర్, హాజరైన అధికారులు

భువనగిరిటౌన్ : మహిళల ఆర్థిక పురోగతి, సాధికారితకు సహకారం అందించాలని కలెక్టర్ పమేలా సత్పతి వుయ్ ప్రతినిధుల బృందాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఉమెన్ ఎంట్రపెన్యూర్స్ హబ్ వుయ్ హబ్ సీఈఓ దీప్తి ఆధ్వర్యంలో నలుగురు ప్రతినిధుల బృందం గురువారం కలెక్టర్‌ను కలిశారు. వుయ్ హబ్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. సాధికారిత కోసం మహిళలు నిర్వహించే కార్యక్రమాల్లో భాగస్వామ్యం, మార్గ నిర్దేశం చేయడంతో పాటు నిధులు సమకూరుస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు కావాల్సిన సహకారం అందించి ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నైపుణ్యాలను మెరుగుపరిచే విషయంలో జిల్లా యంత్రాంగంతో కలిసి పనిచేయాలని వారికి సూచించారు. రాబోయే మూడేళ్లలో విద్యారంగంలో సృజనాత్మక మార్పులు తేవడానికి, సమస్యలను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డీఆర్‌డీఓ ఉపేందర్‌రెడ్డి, డీఈఓ నారాయణరెడ్డి, సెక్టోరియల్ అధికారి అండాళు పాల్గొన్నారు.

12 నుంచి దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరి : 317 జీఓకు సంబంధించిన ఉపాధ్యాయులు బదిలీకోసం ఈ నెల 12నుంచి 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కె.నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు హార్డు కాపీలను డ్రాయింగ్ అధికారికి అందజేయాలన్నారు. అనారోగ్యపరమైన మరియు దివ్యాంగులకు సంబంధించి ప్రత్యేక కేటగిరీలో బదిలీ లేదా పదోన్నతి కోరుకునే వారు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మెడికల్ బోర్డులో ఈ నెల 13,14వ తేదీల్లో హాజరై ధ్రువీకరణ పత్రం పొందాలన్నారు. ధ్రువీకరణ పత్రం, బదిలీ దరఖాస్తుతో పాటు ఆన్‌లైన్‌లో పొందుపర్చిన దరఖాస్తు ఫారానికి జతపరిచిన కాపీలను అధికారులకు అందజేయాలన్నారు. తప్పుడు సమాచారం ఉన్నా, తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఫారానికి జత చేసినా వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. స్పౌజ్, ప్రత్యేక కేటగిరీలో లబ్ధి పొంది తిరిగి అదే కేటగిరీ కింద ఎవరైనా బదిలీకి దరఖాస్తు చేసుకున్నట్లు తమ దృష్టికి వస్తే జిల్లా కార్యాలయంలో తెలియజేయాలన్నారు.

హైకోర్టు స్టేపై తప్పుదోవ పట్టిస్తున్నారు

- యాదగిరిగుట్ట చైర్‌పర్సన్‌పై కలెక్టర్‌కు కౌన్సిలర్ల ఫిర్యాదు
- అవిశ్వాసం పెట్టాలని వినతి



జనవరి 30న కలెక్టర్‌కు ఇచ్చిన అవిశ్వాస తీర్మాన పత్రం చూపుతున్న సీపీఐ కౌన్సిలర్ అనిల్

సాక్షి, యాదాద్రి, యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్ గౌడ్‌పై ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై హైకోర్టు నుంచి ఎలాంటి స్టే రాలేదని, అధికారులు, ప్రజలను ఆమె తప్పుదోవ పట్టిస్తున్నారని కౌన్సిలర్లు ఆరోపించారు. అవిశ్వాసానికి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ సీపీఐ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు భర్తలు గురువారం కలెక్టర్ పమేలా సత్పతిని కలెక్టరేట్‌లో కలిశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ కౌన్సిలర్, వైస్ చైర్మన్ కాటంరాజు, సీపీఐ కౌన్సిలర్ దండబోయిన అనిల్ మాట్లాడుతూ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం కోరుతూ గత నెల 30న 11 మంది కౌన్సిలర్లం కలెక్టర్‌కు తీర్మానపత్రం ఇచ్చినట్లు తెలిపారు. పది రోజులు అవుతున్నా నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో మరోసారి కలెక్టర్‌ను కలిశామన్నారు. తాండూరు మున్సిపల్ చైర్మన్‌కు హైకోర్టు స్టే వచ్చిందే తప్ప.. యాదగిరిగుట్ట చైర్ పర్సన్‌కు రాలేదన్నారు. తప్పుదోవ పట్టిస్తున్న చైర్ పర్సన్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బూడిద సురేందర్ (బీఆర్‌ఎస్), ముక్కెర్ల మల్లేష్ (కాంగ్రెస్)తో పాటు గుండ్లపల్లి భరత్‌గౌడ్, బబ్బూరి శ్రీధర్, గౌళికార్ రాజేష్, బిట్టు హరీష్, ఆవుల సాయి ఉన్నారు. ఇండిపెండెంట్ కౌన్సిలర్ సీస విజయలక్ష్మీకృష్ణ, బీఆర్‌ఎస్ కౌన్సిలర్ తాళ్లపల్లి నాగరాజు వెళ్లలేదు.

ఈఎంటీ, పైలట్ పోస్టులకు ఇంటర్వ్యూలు

భువనగిరి : ఈఎంఆర్‌ఐ, గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని పశు సంవర్థక శాఖ కార్యాలయంలో 108 సర్వీసులోని ఈఎంటీ, పైలట్ పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూ నిర్వహించారు. 45 మంది హాజరు కాగా పైలట్ పోస్టులకు 15 మంది, ఈఎంటీ పోస్టులకు ఆరుగురిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి నసీరుద్దీన్, శ్రీనివాస్, హరిశంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలకు రూ.24కోట్లు మంజూరు

- భువనగిరికి రూ.17.50 కోట్లు, పోచంపల్లికి రూ.6.50 కోట్లు
- పరుగులు పెట్టనున్న అభివృద్ధి పనులు

భువనగిరి, భూదాన్‌పోచంపల్లి : భువనగిరి, భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీలకు నిధుల వరద పారింది.ఇందుకు సంబంధించి గురువారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

భువనగిరికి విడుదలైన నిధులు ఇలా..

భువనగిరి మున్సిపాలిటీకి టీయూఎఫ్ఐడీసీ(తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) రెండో విడత కింద రూ.17.50 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే మొదటి విడత విడుదలైన రూ.16.50 కోట్లతో పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు.

వీటికి కేటాయించే అవకాశం

రూ.17.50 కోట్లతో ప్రధాన నాలా అభివృద్ధి, ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్‌పై రకరకాల బొమ్మల ఏర్పాటు, పార్కులో చిన్న పిల్లల ఆటల సామగ్రి ఏర్పాటు, పట్టణ కమ్యూనిటీ హాల్ నిర్మాణం, వినాయక చౌరస్తాను జంక్షన్‌గా మార్చడానికి వినియోగించే అవకాశం ఉంది.

భూదాన్‌పోచంపల్లిలో..

భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీకి రూ.6.50 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే ప్రధాన రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించారు. రోడ్డు మధ్య డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. గ్రీనరీ పనులు కొనసాగుతున్నాయి. దీంతో పాటు చౌరస్తాలను విశాలంగా చేసి మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. తాజాగా మంజూరైన నిధులతో మరింత అభివృద్ధి చెందనుంది.

పోచంపల్లికి మూడేళ్లలో రూ.39.11 కోట్లు



మాట్లాడుతున్న విజయలక్ష్మి, ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : పట్టణ అభివృద్ధికి మూడేళ్లలో రూ.39.11 కోట్లు మంజూరయ్యాయని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం పోచంపల్లిలో విలేకరులతో మాట్లాడారు. తాజాగా ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి రూ.6.50కోట్లు మంజూరు చేయించారని తెలిపారు.ఈ నిధులతో ప్రతి వార్డులో రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, అంతర్గత డ్రెయిన్లు నిర్మిస్తామన్నారు. గాంధీ విగ్రహం నుంచి రేవనపల్లి వరకు రోడ్డు విస్తరణకు రూ.2.10కోట్లు, ఇతర రోడ్లకు రూ.5.96 కోట్లు మంజూరయ్యాయని, ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నట్లు చెప్పారు. ఇటీవల రూ.8.50 కోట్లతో చేపట్టిన నాలుగులేన్ల రోడ్డు, సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీని ప్రారంభించుకున్నామని చెప్పారు. నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అవిశ్వాసం పెడుతారని వస్తున్న ఊహగాహనాలను చైర్‌పర్సన్ కొట్టిపారేశారు. పాలకవర్గమంతా కలిసే ఉన్నామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, కౌన్సిలర్లు దారెడ్డి మంజుల వేణురెడ్డి, కొంగరి కృష్ణ, సుర్కంటి జ్యోతి రంగారెడ్డి, పెద్దల చక్రపాణి, కర్నాటి రవీందర్, గుండు మధు,మోటె రజిత రాజు, కుడికాల అఖిల బలరాం, దేవరాయ కుమార్, జల్ది నర్సింహ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సీత వెంకటేశం, కార్యదర్శి జి.మల్లేశ్‌గౌడ్, అంకం పాండు, మహేశ్, గుండు రాజేశ్వరి పాల్గొన్నారు.

త్వరలో ప్రతిపాదనలు రూపొందిస్తాం

రెండో విడత టీయూఎఫ్ఐడీసీ నిధులతో అభివృద్ధి పనులను చేపడుతాం. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశానుసారం త్వరలో ప్రతిపాదనలు రూపొందిస్తాం.
– నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

స్వల్పంగా పెరిగిన హుండీ ఆదాయం



హుండీలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

చివ్వెంల (సూర్యాపేట): లింగమంతులస్వామి జాతరలో ఏర్పాటు చేసిన హుండీలను గురువారం అధికారులు లెక్కించారు. గత జాతరలో హుండీ ఆదాయం రూ.23.28లక్షలు రాగా, ఈసారి మొత్తం 28 హుండీల్లో రూ.25.71 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారుల వెల్లడించారు. అదేవిధంగా 550 గ్రాముల వెండి, రెండు గ్రాముల బంగారం వచ్చినట్లు పేర్కొన్నారు. అయితే ఓ యువకుడు తాను ప్రేమించిన అమ్మాయితో జీవితాంతం కలిసి ఉండాలని రక్తంతో లేఖ రాసి హుండీలో వేశాడు. కార్యక్రమంలో ఆర్డీఓ రాజేంద్రకుమార్, తహసీల్దార్ రంగారావు, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేందర్‌కుమార్, ఈఓ కుశలయ్య, పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులుయాదవ్, డైరెక్టర్లు జటంగి వెంకటేశ్వర్లుయాదవ్, కాసం శ్రీనివాస్, మట్టపల్లి శ్రీనివాస్, మొండికత్తి దుర్గమ్మ, మెంతబోయిన వెంకన్న, వార్డు కౌన్సిలర్ జాటోతు లక్ష్మి మకట్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

మకర తోరణం తరలింపులో తోపులాట

జాతర ముగింపు సందర్భంగా నిర్వహించిన మకర తోరణం తరలింపులో కోడి, వల్లపు వంశీయుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. పోలీసులు గమనించి ఇరు వర్గాలకు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. అదేవిధంగా గట్టుపై పీకలు ఊదుతూ ఆకతాయిలు ఘర్షణ పడడంతో కొంతమంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

లింగమయ్యా.. మళ్లొస్తామయ్యా



బోనం సమర్పించేందుకు వస్తున్న యువతి



పెద్దగట్టు వద్ద గొర్రె పొట్టేలుతో ఆలయ చైర్మన్, నాయకులు తదితరులు

- ముగిసిన పెద్దగట్టు జాతర
- చివరి రోజు వైభవంగా మకర తోరణం తరలింపు

సూర్యాపేట, చివ్వెంల: ఐదు రోజుల పాటు ఓ లింగా.. ఓ లింగా.. నామస్మరణతో మార్మోగిన పెద్దగట్టు జాతర గురువారం ముగిసింది. చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలో కొలువైన శ్రీలింగ మంతులస్వామి(పెద్దగట్టు) జాతరకు లక్షలాది మంది భక్తులు హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణలోనే రెండో అతిపెద్దదైన ఈ జాతర ఈ నెల 5వ తేదీన సూర్యాపేట మండలం కేసారం గ్రామం నుంచి దేవరపెట్టె, సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి మకర తోరణాన్ని పెద్దగట్టుకు తీసుకురావడంతో ప్రారంభమైంది. జాతరలో అత్యంత ముఖ్య ఘట్టమైన సౌడమ్మ తల్లికి బోనాల చెల్లింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మంగళవారం చంద్రపట్నం, బుధవారం నెలవారం కార్యక్రమాలను చేపట్టారు. గురువారం మకర తోరణాన్ని సూర్యాపేటకు తరలించడంతో జాతర ముగిసింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జిల్లా అధికారులు, ఆలయ పాలకవర్గం సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేశారు.

మకర తోరణం ప్రత్యేకత..

యాదవుల సంప్రదాయం ప్రకారం జాతర ప్రారంభానికి ముందు లింగమంతుల స్వామి అలంకరణ కోసం సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి కోడి, వల్లపు వంశస్తులు మకర తోరణాన్ని తెచ్చారు. ఈ తోరణాన్ని తిరిగి ఊరేగింపుగా సూర్యాపేటకు తరలించారు. అదేవిధంగా లింగమంతుల స్వామి గుడిపై ఉంచిన పసిడి కుండను దురాజ్‌పల్లి ఆవాసం ఖాసీంపేటకు చెందిన అలిశెట్టి వంశస్తులు జాతరకు ముందు తీసుకువచ్చి తిరిగి గురువారం తీసుకువెళ్లారు.

అన్ని శాఖల సమన్వయంతో..

జాతర విజయవంతం కావడంలో అన్ని శాఖలు సమన్వయంగా పనిచేశాయి. పోలీసు శాఖ అత్యాధునిక సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణను విజయవంతంగా నిర్వహించింది. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి ప్రజా రవాణాకు సమహకరించింది. వైద్యారోగ్యశాఖ ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసి భక్తులకు సేవలందించింది. పారిశుద్ధ్య నిర్వహణలో మున్సిపల్ శాఖ, భక్తులకు తాగునీటికి ఇబ్బందులు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టారు. పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సమన్వయంతో జాతర కవరేజీ నిర్వహించింది. వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు పర్యాటక ప్రదేశాలపై ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడంతో పాటు కళాకారులచే కళా ప్రదర్శనలు చేయించి భక్తులను ఆకట్టుకున్నాయి. జాతరలో విజయవంతంగా పూర్తికావడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

చివ్వెంల: సూర్యాపేట పట్టణంలోని కృష్ణా టాకీస్ ప్రాంతానికి చెందిన 4 సంవత్సరాల బాలుడు తల్లిదండ్రులతో కలిసి దురాజ్‌పల్లి జాతరకు వచ్చి తప్పిపోయి తిరుగుతుండగా తుమ్మలపెనపహాడ్ గ్రామానికి చెందిన కొరివి లింగయ్య గుర్తించి పోలీస్ కంట్రోల్ రూంలో అప్పగించాడు. పోలీసులు బాలుడి తల్లిదండ్రులను గుర్తించి వారికి బాలుడిని అప్పగించారు.



స్వామి వారికి మొక్కుతున్న భక్తులు



కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

ప్రతీ గ్రామ చరిత్రను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తాం

- తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్



రైతులతో మాట్లాడుతున్న జూలూరి గౌరీశంకర్

నడిగూడెం: తెలంగాణలోని ప్రతి గ్రామ చరిత్రను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపర్చడంతో పాటు సాహిత్య అకాడమీలో గ్రంథాల రూపంలో అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. మన ఊరు–మన చరిత్ర కార్యక్రమంలో భాగంగా గురువారం నడిగూడెం మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో కోదాడకు చెందిన కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు చేపట్టిన సర్వేను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి రైతులు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బందితో మాట్లాడారు. గ్రామంలో పండిస్తున్న పంటల వివరాలు, పశుసంపద, గ్రామస్తుల స్థితిగతులు, జీవన విధానం, సాయుధ పోరాట యోధుల వివరాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 33మంది కోఆర్డినేటర్ల ఆధ్వర్యంలో విద్యార్థులతో గతేడాది నవంబరులో మన ఊరు–మన చరిత్ర కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు ఖమ్మంలో 700 గ్రామాలు, నల్లగొండ ఎన్జీ కళాశాల విద్యార్థులు 250 గ్రామాలు, కోదాడ కేఆర్‌ఆర్ కళాశాల విద్యార్థులు 26 గ్రామాల చరిత్రను సేకరించడం పూర్తిచేశారని తెలిపారు. రాష్ట్రంలోని 12,769 గ్రామాల ప్రజలకు తమ ఊరి చరిత్రను తెలియజేయాలనే సంకల్పంతో సంబంధిత జిల్లా కలెక్టర్లు, ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీకోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నందిగామ నిర్మలకుమారి, తెర సాంస్కృతిక వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలుగు అధ్యాపకుడు వేముల వెంకటేశ్వర్లు, రాంపల్లి సతీష్, గ్రామ పెద్దలు మొక్క భిక్షపతి, వట్టికూటి చలపతి, శెట్టి సతీష్, పసుపులేటి యాదగిరి, తాళ్లూరి రమేష్, వేదాంతం చక్రధరాచార్యులు తదితరులు ఉన్నారు.

రాజావారి కోటను సందర్శించిన గౌరీశంకర్

నడిగూడెం: మండల కేంద్రంలోని రాజావారి కోటను గురువారం జూలూరి గౌరీశంకర్ సందర్శించారు. ఈ సందర్భంగా కోటలోని పలు భవనాలు, గ్రంథాలయంలో గ్రంథాలను పరిశీలించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కాగితరామచంద్రాపురం గ్రామానికి చెందిన అబ్దుల్ ఘని (38), పఠాన్ షరీఫ్ (40) కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట డాక్టర్ నిర్మల కుమారి, వెంకటేశ్వర్లు, మన ఊరు–మన చరిత్ర సర్వే బృందం ఉన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: మండల పరిధిలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో నిరుద్యోగ యువతకు రెండు నెలల కాలపరిమితితో అకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ), బేసిక్ కంప్యూటర్ అండ్ ఇంగ్లిష్, ఆటోమొబైల్ 2, 3 వీలర్ సర్వీసింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ) కోర్సుకు బీకాం, బేసిక్ కంప్యూటర్ అండ్ ఇంగ్లిష్ కోర్సుకు ఇంటర్మీడియట్, ఆటోమొబైల్ 2, 3 వీలర్ సర్వీసింగ్ కోర్సుకు పదో తరగతి పాసై ఉండాలని తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కల్గి ఉండాలని, ఆసక్తి, అర్హత కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హత ఒరిజినల్, జిరాక్స్ సెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డుతో ఈ నెల 20న సంస్థలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు నేరుగా హాజరుకావాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.2వేల ఫీజుతో పాటు హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. అదేవిధంగా స్టడీ మెటీరియల్‌కు రూ.350లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత అభ్యర్థులకు తప్పనిసరిగా ఉద్యోగం కూడా కల్పించబడుతుందన్నారు. ఇతర వివరాలకు 9133908000, 933908111, 9133908222 నంబర్లను సంప్రదించాలన్నారు.

కేసు నమోదు

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడేనికి చెందిన బాతరాజు నర్సింహ బుధవారం బైక్‌పై వెళ్తుండగా స్థానిక వలిగొండ చౌరస్తా వద్ద వెనుక నుంచి వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నర్సింహను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కుమారుడు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.

హోండా షోరూంలో చోరీ

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని కోదాడ రోడ్డులో గల హోండా షోరూంలో బుధవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. షట్టర్ తాళం పగులగొట్టి షోరూంలోకి ప్రవేశించి హార్డ్‌డిస్క్, 2 సీసీకెమెరాలు, 2 వైఫై రూటర్లు అపహరించారు. షోరూం యజమాని సతీష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యాదాద్రి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి



అభినందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరిటౌన్: క్రీడల్లో యాదాద్రి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు జరిగిన 5వ నేషనల్ మాస్టర్ గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2023లో జిల్లాకు చెందిన గోనూరు శ్రీనివాస్(ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్), అంబోజు అనిల్‌కుమార్(కానిస్టేబుల్) పాల్గొని మెడల్స్ సాధించారు. వీరిని గురువారం కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ధనంజనేయులు, సిబ్బంది మురళి, శ్రీనివాస్, జయ ఉన్నారు.

క్రీడలపై విద్యార్థులు ఆసక్తి చూపాలి

క్రీడలపై విద్యార్థులు ఆసక్తి చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. ఈ నెల 1, 2 తేదీల్లో ఢిల్లీలో జరిగిన షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన జిల్లాకు చెందిన డి. మనోజ్ కుమార్, సీహెచ్. ప్రవీణ్‌కుమార్‌ను కలెక్టరేట్‌లో గురువారం ఆయన సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కె. ధనంజనేయులు, రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు యాదయ్య, పి. నాగయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గోల్డ్ మెడల్ చూపుతున్న వైష్ణవి

మోత్కూరు : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మానేరు హైస్కూల్‌లో ఈ నెల 7, 8 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ జూడో పోటీల్లో మోత్కూరు సాయి చైతన్య ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని ఓర్సు వైష్ణవి ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ బి.రవీందర్‌రెడ్డి గురువారం తెలిపారు. విద్యార్థిని 16న చెన్నైలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వైష్ణవి పాల్గొంటుందని తెలిపారు.

జెట్ట నవ్యశ్రీకి కాంస్య పథకం

ఆత్మకూరు(ఎం) : సబ్ జూనియర్ బాలికల విభాగం రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో 31 కేజీ విభాగంలో ఆత్మకూరు(ఎం) మండలం రాయిపల్లి గ్రామానికి చెందిన జెట్ట నవ్యశ్రీ కాంస్య పథకం సాధించింది. ఈమె ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది.

ఇంజక్షన్ వికటించడంతో నడవలేని స్థితికి బాలుడు

- పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రుల ఫిర్యాదు



కుమారుడితో తల్లిదండ్రులు

కోదాడరూరల్ : ఇంజక్షన్ వికటించడంతో బాలుడు నడవలేని స్థితికి చేరుకున్నాడు. ఈ సంఘటన కోదాడ మండల పరిధిలోని మంగళితండాలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలుడి తల్లిదండ్రులు ధరావత్ వెంకటేశ్వర్లు, పుష్ప తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 30న తమ కుమారుడు మోక్షిత్‌కు జ్వరం రావడంతో స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ పాషా వద్దకు తీసుకెళ్లినట్లు తెలిపారు. అతను కాకుండా ఆయన తన కుమారుడితో బాలుడికి ఇంజక్షన్ వేయించారని ఆరోపించారు. అప్పటి నుంచే తన కుమారుడు నడవలేకపోతున్నాడని వాపోయారు. ఖమ్మం తీసుకెళ్లి వైద్యం చేయించినా ఎలాంటి మార్పులేదన్నారు. గురువారం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు సూర్యాపేట ప్రభుత్వ వైద్యశాలకు లేక హైదరాబాద్‌లోని ఉస్మానియా వైద్యశాలకు తీసుకెళ్లాల్సి ఉంటుందని చెప్పారని తెలిపారు. తమ కుమారుడిని నడవలేని స్థితికి తీసుకొచ్చిన ఆర్ఎంపీ పాషా, అతని కుమారుడిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయంపై రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆర్ఎంపీ పాషాను వివరణ కోరగా ఇంజక్షన్ ఇచ్చిన మాట వాస్తవమేనని, ఇంజక్షన్ వేసే సమయంలో బాలుడు కాలు కదిపి ఉండొచ్చని, ఆ సమయంలో ఏదైనా జరిగి ఉండొచ్చని పేర్కొన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా

భువనగిరి: కాల్వ తవ్వేందుకు వెళ్లిన కూలీ మృతికి కాంట్రాక్టర్, సైట్ ఇంజనీర్ కారణమని వారికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ గురువారం భువనగిరి ప్రధాన జూనియర్ సివిల్ కోర్టు తీర్పు వెలువరించింది. వివరాలు.. మండలంలోని బస్వాపురం గ్రామంలో 2018లో కాల్వ తవ్వుతుండగా అక్కడే కూలీ పనిచేస్తున్న మహేష్ కాల్వలో పడి మృతిచెందాడు. కాంట్రాక్టర్, సైట్ ఇంజనీర్ సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే మహేష్ మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ భిక్షపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కాగా గురువారం భువనగిరి ప్రధాన జూనియర్ సివిల్ కోర్టు ఈ కేసును విచారించి.. కాల్వ తవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిండంతోనే మహేష్ మృతిచెందాడని, అతడి మృతికి కారకులైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లాకు చెందిన సైట్ ఇంజనీర్ ఏడుకొండల్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లాకు చెందిన కాంట్రాక్టర్ శ్రీరామ్‌కు ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

అపహరించిన ఎద్దులను పట్టుకున్న రైతులు



ఎద్దులతో రైతులు

కొండమల్లేపల్లి: అపహరణకు గురైన ఎద్దులను రైతులు పట్టుకోగా.. వారిని చూసి దుండగులు పరారయ్యారు. ఈ సంఘటన మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన బొడ్డు లాలయ్య బుధవారం తన వ్యవసాయ పొలంలో జోడెడ్లను కట్టేసి ఉంచాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన అతడు భోజనం చేసిన తర్వాత రాత్రి 11 గంటల సమయంలో మిరప తోటకు నీళ్లు పెట్టేందుకు పొలం వద్దకు వెళ్లి చూడగా ఎడ్లు కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల గాలించాడు. ఈ విషయాన్ని గ్రామంలోని రైతులకు తెలియజేయడంతో పాటు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ క్రమంలోనే నాంపల్లి మండలం పగుడిపల్లి గ్రామ సమీపంలో రైతులు అపహరణకు గురైన ఎడ్లను గుర్తించారు. రైతులు రావడాన్ని పసిగట్టిన దుండగులు ఎడ్లను అక్కడే వదిలేసి పరారయ్యారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- బంగారం, రూ.25వేల నగదు అపహరణ

నేరేడుచర్ల: తాళం వేసిన ఇంట్లో పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన గురువారం సాయంత్రం నేరేడుచర్ల పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వెంకట్రామా థియేటర్ సమీపంలో నివసిస్తున్న రేపాల జనార్దన్, ఆయన సతీమణి ఊర్మిల స్వీట్లు తయారు చేసి దుకాణాలకు విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో దురాజ్‌పల్లి లింగమంతుల జాతరలో దుకాణాలు ఏర్పాటు చేసిన వారికి వారు స్వీట్లు అందజేయగా, అందుకు సంబంధించిన డబ్బులు వసూలు చేసేందుకు గురువారం ఉదయం 10గంటల సమయంలో భార్యాభర్తలు ఇంటికి తాళం వేసి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపు పగులగొట్టి, ఇంట్లోని బీరువా కిందపడి ఉండటంతో పాటు భార్యాభర్తలు ఇద్దరూ ఆందోళనకు గురయ్యారు. బీరువాలో దాచుకున్న రూ.25వేల నగదు, రెండు చంప సగరాలు, రెండు చెవుల దిద్దులు, నాలుగు తులాల బంగారు ఆభరణాలు, బంగారు చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే నేరేడుచర్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాగర్‌లో విషాదం



నాగార్జునసాగర్ వద్ద కృష్ణానదిలో మునిగి మృతిచెందిన నాగరాజు, చంద్రకాంత్, వాచస్పతి

వాచస్పతి(ఫైల్)



నాగార్జునసాగర్ ప్రాజెక్టు దిగువన శివాలయం పుష్కర ఘాట్ వద్ద డీఎస్పీ వెంకటగిరి తదితరులు

రక్తమోడిన రహదారులు

- వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం



నాగార్జునసాగర్: ఘటనా స్థలంలో కాంచన మృతదేహం

నాగార్జునసాగర్: బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలను కారు ఢీకొట్టడంతో భార్య అక్కడికక్కడే మృతిచెందగా, భర్తకు గాయాలయ్యాయి. ఈ ఘటన నాగార్జునసాగర్–హాలియా ప్రధాన రహదారి వెంట ఉన్న నాట్కో ఫార్మా రెసిడెన్సీ క్వార్టర్ల ముందు గురువారం చోటుచేసుకుంది. నాగార్జునసాగర్ ఎస్ఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీకి చెందిన మైలంపల్లి మల్లికార్జున్, మైలంపల్లి కాంచన (24) భార్యభర్తలు. మత్స్యకారులైన వీరు చేపలు పట్టేందుకు రాత్రి సాగర్ జలాశయంలో వేసిన వలలు తీసేందుకు రోజు మాదిరిగానే గురువారం ఉదయాన్నే బైక్‌పై జలాశయ తీరానికి బయల్దేరారు. ఈ క్రమంలో నాగార్జునసాగర్–హాలియా ప్రధాన రహదారి వెంట ఉన్న నాట్కో ఫార్మా రెసిడెన్సీ క్వార్టర్ల ముందు చేరుకోగానే హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కారంపూడికి వెళ్తున్న కారు వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాంచన అక్కడికక్కడే మృతిచెందగా, మల్లికార్జున్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం కాంచన మృతదేహాన్ని స్థానిక కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. గాయాలపాలైన మల్లికార్జున్‌కు అదే ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ పైనుంచి పడి..



నర్సయ్య (ఫైల్)

అర్వపల్లి: సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై పర్సాయపల్లి స్టేజీ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మండలం దేవరనేని కొత్తపల్లి గ్రామానికి చెందిన గైగుళ్ల నర్సయ్య(57) బుధవారం సాయంత్రం ట్రాక్టర్‌లో ధాన్యాన్ని వేసి అర్వపల్లిలోని రైస్ మిల్లుకు పంపించాడు. అనంతరం తన బైక్‌పై ట్రాక్టర్ వెనుకనే మిల్లు వద్దకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రాత్రి పర్సాయపల్లి స్టేజీ వద్దకు చేరుకోగానే బైక్ అదుపుతప్పడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి. అంజిరెడ్డి తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బైక్‌పై వెళ్తూ గోడను ఢీకొట్టి..

భువనగిరి: బైక్‌పై వెళ్తూ గోడను ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన భువనగిరి మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలం జైనపల్లి గ్రామానికి చెందిన మైలారం విఘ్నేష్(33) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 8న భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామంలో తన స్నేహితుడు బింగి శివ సోదరుడి దశదిన కర్మకు హాజరై తిరిగి బైక్‌పై వెళ్తుండగా గ్రామంలోని సాయిలీల వెంచర్ మూలమలుపు వద్ద వెంచర్ గోడను ఢీకొట్టాడు. దీంతో సమీపంలో ఉన్న చెట్లల్లో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

నార్కట్‌పల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం తెల్లవారుజామున మండలంలోని రాంనగర్ కాలనీ వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడెం గ్రామ సమీపంలోని రామ్‌నగర్ కాలనీ వద్ద అద్దంకి– నార్కట్‌పల్లి బైపాస్‌పై నార్కట్‌పల్లి నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి(35)ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు నీలి రంగు జీన్స్, క్రీమ్ రంగు చొక్కా ధరించి ఉన్నాడని, అతడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, ఆచూకీ తెలిసిన వారు 94407 95636, 94407 95610 నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ పేర్కొన్నారు.

లారీ ఢీకొట్టడంతో..



భువనగిరి: [illegible]

భువనగిరి పట్టణంలోని ఎల్‌బీ నగర్‌కు చెందిన తోట కృష్ణ(40) గురువారం సింగన్నగూడెం చౌరస్తా వద్ద వరంగల్– హైదరాబాద్ ప్రధాన రహదారి దాటుతుండగా, హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు అతి వేగంగా వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో కృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ సత్యనారాయణ తెలిపారు.